సాక్షి నంద్యాల

మంగళవారం, 19, మే, 2026

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం ఏలూరుకు చెందిన వి.నతీష్ చౌదరి రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు కె.శివప్రసాద్‌కు అందజేశారు.

ఊరు పొమ్మంటుందా?

అక్రమంగా నివాసం ఉంటున్నారంటూ సున్నిపెంట ప్రజలకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. 'ఇవేం నోటీసులు, ఊరు పొమ్మంటుందా' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 8లో▸

ఉష్ణోగ్రతలు

గరిష్టం	41.5
కనిష్టం	28.9

న్యూస్‌లీల్

మహిళల జీవనోపాధులకు కృషి

శిరివెళ్ల: పొదుపు సంఘాల మహిళల జీవనోపాధులకు కృషి చేస్తున్నామని వెలుగు స్త్రీ నిధి ఏజీఎం నాగభూషణం అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో స్త్రీ నిధి రుణాల పంపిణీ, వసూళ్లపై ఏపీఏం రాజశేఖర రెడ్డితో చర్చించారు. ఆయన మాట్లాడుతూ మహిళల జీవనోపాధులకు ఎంత నిధులు అవసరం, ఏ నిధులను ఏఏ విభాగాల నుంచి మంజూరు చేయాలనే అంశంపై మహిళలతో యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నామన్నారు. బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, స్త్రీ నిధి రుణాల మంజూరుకు యాక్షన్ ప్లాన్ ఉందన్నారు. 2026-26 ఆర్థిక సంఘానికి జిల్లాలో 40 వేల మంది మహిళలకు రూ. 377 కోట్ల స్త్రీ నిధి రుణాల పంపిణీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు పాల్గొన్నారు.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

మల్లన్న దర్శనానికి వేచి వున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి వేలాది మంది భక్తులు సోమవారం శ్రీగిరికి తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలైన్ల వద్ద బారులుదీరారు. భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు నిండిపోయాయి. భక్తుల శివనామ స్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగింది. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా క్యూకంపార్ట్‌మెంట్లలో వేడిపాలు, తాగునీరు, అల్పాహారం, ప్రసాదం పంపిణి చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర పరిధిలో పలుచోట్ల దేవస్థానం ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాలలో మంచినీటితో పాటు మజ్జిగను కూడా భక్తులకు ఉచితంగా అందిస్తున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: 2026-27 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్, ఫెయిల్ ఆసక్తి కల్గిన అభ్యర్థులు ఈ నెల 19 నుంచి జూన్ 30వ తేదీ వరకు itiadmissions. ap.gov.in/iti వెబ్ సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన కాపీలను జూలై 2వ తేదీలోపల సమీప ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లి పరిశీలించుకోవాలన్నారు. వారికి మెరిట్ లిస్ట్ జాబితాలో పేర్లు పొందుపరుస్తామన్నారు. మరిన్ని వివరాలకు సమీప ఐటీఐ కళాశాలలను సంప్రదించాలన్నారు.

21 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4వ తేదీ నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ జి.లాలెప్ప తెలిపారు. కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ కాలేజీలో సోమవారం ముఖ్య పర్యవేక్షకులు, శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగనున్నాయన్నారు. ఈ పరీక్షలకు 25,819 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, 57 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

బంగారంపై రుణాల కోసం...

స్టేట్‌బ్యాంక్‌కు వచ్చిన రైతులు

పత్తికొండ: పాసు పుస్తకంపై తక్కువ వడ్డీతో బంగారంపై రుణాలు ఇచ్చే సౌలభ్యం ఉండటంతో రైతులు భారీగా బ్యాంకులకు వెళ్తున్నారు. సోమవారం ఉదయమే పత్తికొండ పట్టణంలోని స్టేట్‌బ్యాంక్‌కు పెద్ద ఎత్తున వచ్చారు. బ్యాంక్ సిబ్బంది వారిని క్యూ పద్ధతిలో లోపలికి పంపారు. పట్టాదారు పాసుబుక్‌లను తీసుకుని టోకెన్ విధానం ద్వారా లోపలకి పిలిచి రుణం మంజూరు చేశారు.

కల్లూరులో ఎద్దుల బండ్ల ప్రదర్శనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు

పెట్రో పిడుగుపై ఎగిసిన నిరసన

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- ర్యాలీలు, వినూత్న నిరసనలు
- ఇంధన ధరలు తగ్గించాలని పార్టీ నేతల డిమాండ్
- ఆర్డీవోలు, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాల అందజేత
- భారీగా పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ శ్రేణులు

నంద్యాల: పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సోమవారం పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఎద్దుల బండ్లపై వెళ్తూ, వాహనాలకు తాడుకట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ర్యాలీల్లో ' రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ దంచుడు..సామాన్యుడి నడ్డి విరుగుడు, సంపద సృష్టి దేవుడెరుగు..సంక్షోభం సృష్టిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం' అన్న బ్యానర్లను ప్రదర్శించారు. కల్లూరులో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, బండిఆత్మకూరులో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బనగానపల్లెలో కాటసాని రామిరెడ్డి, ఆళ్లగడ్డలో గంగుల బిజేంద్రారెడ్డి, నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా, వివిధ నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వ్యాట్, రోడ్డు సెస్సు పేరుతో రూ.3 వేల కోట్లు అదనంగా వసూలు చేస్తోందన్నారు. దీంతో సామాన్యుడు కుదేలయ్యాడని ఆందోళన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు, నారా లోకేష్ మోసం చేశారని విమర్శించారు.

కల్లూరు: తాడుతో ఆటో లాగి నిరసన తెలుపుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని నరసింహారెడ్డి

ఆళ్లగడ్డ: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నేతలు

నిరసనలు ఇలా..

వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరులో వినూత్నంగా నిరసన తెలిపారు. ఎద్దుల బండ్లపై ప్రదర్శన నిర్వహించారు. ఆటోలను లాగుతూ, ద్విచక్ర వాహనాలకు తాళ్లు కట్టి ర్యాలీ చేపట్టారు. కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

➤ జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలోని ఓవర్ బ్రిడ్జి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

➤ ఆళ్లగడ్డ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెంచిన పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

➤ శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ పద్మావతమ్మకు వినతి పత్రం అందజేశారు. దేశంలో ఎక్కడాలేని పెట్రోల్, డీజిల్ ధరలు మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయని, వీటిని వెంటనే తగ్గించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని శిల్పా చక్రపాణిరెడ్డి హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు.

➤ నందికొట్కూరులోని పటేల్ సెంటర్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధారా సుధీర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఇంధన ధరలు పెంపుతో లారీ, ఆటో రంగాలు పూర్తిగా సంక్షోభంలో పడతాయని, దీని వల్ల కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయన్నారు.

➤ బనగానపల్లె పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఆటోకు తాళ్లు కట్టి లాగి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో పెంచిన డీజల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు.

➤ డోన్ పట్టణంలోని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి నివాసం నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెంచిన ఇంధన ధరలను తగ్గించాలని ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డీఓ నరసింహులుకు వినతి పత్రం అందజేశారు.

నంద్యాల: ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా, నేతలు

బండిఆత్మకూరు: బైక్‌లను తాడు కట్టి లాగుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నందికొట్కూరు: రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డాక్టర్ దారా

బనగానపల్లె: ఆటో లాగుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

డోన్: ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

న్యాయం చేయమంటే బెదిరింపులా?

- అభివృద్ధిని విస్మరించి అక్రమ కేసులా?
- మీ నాన్నను మాండ్ర, గౌరు దూషిస్తే శబరమ్మా స్పందించవా?
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, చిత్రంలో దారా సుధీర్

కర్నూలు (టౌన్): 'కర్నూలులో సతీష్ కుటుంబానికి న్యాయం చేయమంటే బెదిరింపులకు పాల్పడతారా?' అని టీడీపీ నేతలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రశ్నించారు. పోలీసుల వేధింపులు భరించలేక తమ పార్టీకి చెందిన యువజన విభాగం కర్నూలు నగర అధ్యక్షుడు బాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై, మూడో పట్టణ సీఐ వేధింపులపై ఈనెల 14న కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశామన్నారు. మంత్రి టీజీ అనుచరులు పోలీసులతో ఒత్తిడి చేయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శలు చేశామన్నారు. దీనిపై టీడీపీ నేతలు ఎందుకంత ఆందోళన పడుతున్నారని ప్రశ్నించారు. కర్నూలు కిసాన్ నగర్‌లోని తన స్వగృహంలో పార్టీ నందికొట్కూర్ నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్‌తో కలిసి సోమవారం బైరెడ్డి సిద్ధార్థరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాటల్లోనే..

'మంత్రి హోదాలో టీజీ భరత్ కర్నూలులో అభివృద్ధి చేయకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారు. దీన్నే మేం ప్రశ్నించాం. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, రౌడీషీటర్ల వరకు రోజూ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ఇలా విమర్శిస్తే రూ.10 వేలు, గట్టిగా మాట్లాడితే స్టోర్ బియ్యం వంటి పనులు అప్పగిస్తున్నారేమో! ప్రజలకు సేవ చేయమని అడిగితే 'సిద్ధార్థ రెడ్డి నీవు.. ఎమ్మెల్యే టిక్కెట్టు తెచ్చుకో' అని మంత్రి చెబుతున్నారు. నా కంటే ఆయనే నేను ఎమ్మెల్యే కావాలని కోరుకుంటున్నారు. ఫార్మా కంపెనీ ముడుపుల మాట వాస్తవమే. నా దగ్గర ఆధారాలు ఉన్నాయి.

తుంగభద్ర కాలుష్యంపై పోరాటం

కర్నూలులోని అల్కాలీస్ ఫ్యాక్టరీతో తుంగభద్ర కాలుష్యం అవుతోంది. నా దగ్గర లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు, ఆధారాలు ఉన్నాయి. కలుషితంతో పశువులు చనిపోతున్నాయి. వక్క, చుక్కల భూములు అన్యాక్రాంతమయ్యాయి. గోశాల ఆక్రమణలు, లీజుల వ్యవహారంపై పోరాటం చేస్తాం. పెద్దలు టీజీ వెంకటేష్ నాపై ఆరోపణలు చేయడం బాధాకరం.

శబరమ్మా.. వాస్తవం తెలుసుకో

అమెరికాలో ఉన్నా ఆగమేఘాల మీద నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరమ్మ కర్నూలు వచ్చి నాపై ఆరోపణలు చేశారు. ఇదంతా మంత్రి టీజీ కార్యాలయ స్క్రిప్ట్ అని తెలుసు. నందికొట్కూరులో టీడీపీ నేతలు గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి.. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని దూషించలేదా? ఎమ్మెల్యే జయసూర్య సైతం బైరెడ్డి చెబితే పనులు చేయాల్సిన అవసరం లేదని బహిరంగంగా మాట్లాడలేదా? మరి మీ నాన్నను అవమానించినప్పుడు ఎక్కడికి పోయావు శబరమ్మా! నీవు కావాలంటే ఎంబీబీఎస్ సీటు, పీజీ సీటు, నంద్యాల పార్లమెంట్ సీటు ఇప్పించారు. తండ్రిని విమర్శించినప్పుడు నోరు మెదపని మీరు.. ఇప్పుడు నాపై మాట్లాడటం విడ్డూరంగా ఉంది. కిడ్నాపర్లు, గంజాయి బ్యాచ్ మీ పక్కనే ఉన్నారనే సంగతి తెలుసుకో'. అన్నారు.

ఉద్యమంలా 'బడి పిలుస్తోంది'

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను భారీ స్థాయిలో చేపట్టేందుకు 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని 'బడి పిలుస్తోంది' కార్యక్రమంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి చేరికలను పెంచడం ప్రధాన లక్ష్యంగా మంగళవారం అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల్లో, మున్సిపల్ ప్రత్యేక అధికారులు ఆయా మున్సిపాలిటీల్లో, ఆర్డీవోలు తమ నియోజకవర్గ పరిధిలో ప్రత్యక్షంగా పర్యటించి విద్యార్థుల చేరికల పురోగతిని సమీక్షించాలన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న దాదాపు 10 వేల మంది పిల్లలు ఉన్నప్పటికీ, వారిలో కేవలం 6,500 మంది ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరారన్నారు. మిగిలిన పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలను సీజ్ చేయడంతో పాటు, అక్రమ అనుమతులు మంజూరు చేసినట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

లాసెట్ ఫలితాలు విడుదల

కర్నూలు (సిటీ): న్యాయ విద్య ప్రవేశాల కోసం ఈనెల 4న ఏపీ లాసెట్, ఏపీ పీజీఎల్ సెట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో మూడు సంవత్సరాల న్యాయ విద్య అభ్యసించేందుకు కర్నూలు జిల్లాలో 628 మంది, నంద్యాల జిల్లాలో 385 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదు సంవత్సరాల న్యాయ విద్య ప్రవేశానికి కర్నూలు జిల్లాలో 66 మంది, నంద్యాల జిల్లాలో 33 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 5 సంవత్సరాల న్యాయ విద్య పరీక్షలో నంద్యాలలోని విద్యానగర్‌కు చెందిన కట్టుబడి మహమ్మద్ హర్షద్ 96 మార్కులతో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు, ఆదోనికి చెందిన టిల్ మహమ్మద్ రాజా 94 మార్కులతో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించారు.

పోక్సో కేసు నమోదు

ఆళ్లగడ్డ: పట్టణంలోని కొత్తమసీదుకు చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. రామాలయం వీధికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈ నెల 3న అదృశ్యమైంది. ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలికను గుర్తించి విచారించగా కొత్త మసీదు చెందిన యువకుడు నిందితుడని తేలడంతో పోక్సో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ నగీన తెలిపారు.

విధుల్లో అలసత్వం వీడండి

బొమ్మలసత్రం: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది అలసత్వం వీడాలని జిల్లా ఎస్పీ సునీల్‌షెరాన్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎస్‌బీ, డీసీఆర్‌బీ, పాస్‌పోర్ట్, సైబర్‌క్రైమ్, ఫ్యాక్షన్ జోన్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. న్యాయం కోసం ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించటమే కాకుండా త్వరగా సమస్యను పరిష్కరించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్‌బీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డీసీఆర్‌బీ సిబ్బంది నేరస్తుల రికార్డులను ఎప్పటికప్పుడూ కొత్త సమాచారాన్ని నమోదు చేస్తుండాలన్నారు. పాస్‌పోర్టు విభాగంలో పనిచేసే సిబ్బంది వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసే బాధ్యత సైబర్‌క్రైమ్ పోలీసులపై ఉందన్నారు. సోషల్ మీడియాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక పోస్టుల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ వెంట ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు సూర్యమౌళి, మల్లికార్జునగుప్తా, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

పీజీఆర్ఎస్‌కు 114 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సునీల్‌షెరాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 114 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి వారి సమస్యను వివరించారన్నారు. సమస్యల్లో చట్టపరమైన వాటిని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించామన్నారు. మరికొన్ని సమస్యలను ఆయా స్టేషన్ పరిధిలోని అధికారులకు పంపామన్నారు. ఇరుపక్షాలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను సూచించామన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని తిరిగి పీజీఆర్ఎస్‌కు అదే వినతులు రాకుండా చూడాలని ఆదేశించామన్నారు.

క్లుప్తంగా

టీడీపీ నాయకుడిపై కిడ్నాప్ కేసు నమోదు

ఆదోని అర్బన్: రెవెన్యూ అధికారి(వీఆర్వో) అయిన సురేష్‌ను ఆదివారం రాత్రి టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుబేర్‌నాథ్ కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. వీఆర్వో సురేష్ భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుబేర్‌నాథ్, మరికొందరి హమాలీలపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. కుబేర్‌నాథ్‌కు వీఆర్వో లక్షల్లో అప్పు ఉందని, దీంతో ఆదివారం హమాలీలు వెళ్లి మాట్లాడి ఆయనను పిలుచుకుని పరిశ్రమలో ఉంచారని తెలిపారు. ఎంతసేపటికీ రాకపోవంతో భార్య జయలక్ష్మి భయాందోళన చెంది వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు వీఆర్వో నంబర్‌ను తీసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి వీఆర్వో సురేష్‌ను భార్యకు అప్పగించామన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుబేర్‌నాథ్, మరికొందరి హమాలీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

మహిళ ఆత్మహత్య

మృతి చెందిన లక్ష్మి (ఫైల్)

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల మేరకు గ్రామానికి చెందిన కిరణ్ భార్య లక్ష్మి (23) గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలుచోట్ల వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. అలాగే కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా మనస్తాపానికి గురైన ఆమె సోమవారం రసాయన పౌడర్‌ను నీళ్లలో కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు గుర్తించి 108లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి కుమారులు దిలీప్, ధీరజ్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టరు..కారు ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు

గాయపడిన వారిని కారు నుంచి బయటకి తీస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామం సమీపంలో 40వ నెంబరు జాతీయ రహదారిపై ట్రాక్టర్, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కడపకు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు అదే రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మున్సీర్ బేగం, సమీర్, అష్జల్, సిద్దీఖ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో సిబ్బంది ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అలాగే క్రేన్ సహాయంతో కారును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నీళ్లు లేవు.. నీడ లేదు!

కోవెలకుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కరువు
- 45 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- గూడారాలు లేక తప్పని అవస్థలు
- బడ్జెట్ లేదంటున్న అధికారులు
- వడదెబ్బ బారిన పడుతున్న కూలీలు

జిల్లాలో మండలాలు	జాబ్‌కార్డులు
29	2.60 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	ఉపాధి కూలీలు
2.13 లక్షలు	3.72 లక్షలు
ఉపాధి పనులకు వెళుతున్న కూలీల సంఖ్య	
79,898	

కోవెలకుంట్ల: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథక కూలీలు భానుడు సెగకు విలవిలలాడుతున్నారు. నెలన్నర నుంచి రోజు రోజుకు సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎండతీవ్రత ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతోంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 43 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో వైపు వడగాల్పులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పొట్ట కూటి కోసం ఎర్రటి ఎండలో శ్రమిస్తున్న ఉపాధి కూలీలకు వేసవి సెగ తప్పడం లేదు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 2.60 లక్షల జాబ్‌కార్డులుండగా ఆయా జాబ్‌కార్డుల్లో 3.72 లక్షల మంది ఉపాధి కూలీలున్నారు. ఆయా మండలాల్లో ప్రతి రోజు 79,898 మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఇందులో ప్యాపిలి మండలంలో అత్యధికంగా 5,577 మంది, పాములపాడు మండలంలో 5,083 మంది, గోస్పాడు మండలంలో 4,125 మంది, రుద్రవరం మండలంలో 3,719 మంది, బనగానపల్లె మండలంలో 2,785 మంది, సంజామల మండలంలో 2,638 మంది, అవుకు మండలంలో 2.,162 మంది, కోవెలకుంట్ల మండలంలో 1,951 మంది, కొలిమిగుండ్ల మండలంలో 1,936 మంది పనులకు వెళుతున్నారు. ఆయా మండలాల్లో ముళ్లపొదల తొలగింపు, కుంటలు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తదితర పంట కాల్వల్లో పూడిక తొలగింపు, ఫీల్డ్ చానల్స్, కొండ ప్రాంతాల్లో ఫెన్స్, జలధార, జలహారతి పథకం ద్వారా భూగర్భ జలాల పెంపు, ఫీడర్‌చానల్స్, ఫారంపాండ్స్, తదితర పనులు చేపడుతున్నారు. వేసవికాలం పనుల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించపోవడంతో కూలీలు ఎండలకు అల్లాడిపోతున్నారు. ఉపాధి కూలీలపట్ల ప్రభుత్వం ఏమాత్రం కనికరం చూపకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పనుల వద్ద మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్ లేదని అధికారులు చేతులెత్తేశారు.

వాటర్ బెల్ వినబడదు.. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వరు

పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామీణాభివృద్ధిశాఖ ఈ నెల 1వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. కాని క్షేత్రస్థాయిలో ఎక్కడా తాగునీటి సదుపాయం కల్పిస్తున్న దాఖలాలు లేవు. కూలీలు ఇంటి వద్ద నుంచి బాటిళ్ల ద్వారా తాగునీటిని తీసుకెళ్లి పని ప్రదేశంలో దాహార్తి తీర్చుకుంటున్నారు. కూలీలు ఎండతీవ్రత కారణంగా వడదెబ్బ బారిన పడకుండా ప్రతి గంటకు నీరు తాగేలా వాటర్‌బెల్ పద్ధతి అమలు చేయాలి. ఇది కూడా కాగితాలకు మాత్రమే పరిమితమైంది.

➤ పనిచేసి అలసిసొలసిపోయిన కూలీలు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు పనిప్రదేశంలో టెంట్లు, తాటాకు, ఈతాకు పందిళ్లు వేయాలి. జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి కన్పించక పోవడంతో కూలీలు ఎండలో ఆపసోపాలు పడుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా కొందరు కూలీలు పని ప్రదేశాల్లోని కంప, ఇతర చెట్ల నీడన సేద తీరుతున్నారు.

➤ పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలి. కాని ఎక్కడా ఆ పరిస్థితులు కన్పించడం లేదు. ఉపాధి కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరుకుని తిరిగి 11 గంటలకు ఇళ్లకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలి. అవసరమైతే సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు పనులు చేసుకునేలా వెసలుబాటు కల్పించాలి. దాదాపు రెండు నెలల నుంచి జిల్లాలో ఉదయం 9 గంటల నుంచే వాతావరణం నిప్పుల కొలిమిలా మారుతోంది. అయినప్పటికి ఉపశమన చర్యలు చేపట్టడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

➤ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పనుల వద్ద మౌలిక వసతులు కల్పించడంతోపాటు కూలీలకు మజ్జిగా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి ఉపాధి కూలీలకు అండగా నిలిచింది. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం వీటన్నింటికి మంగళం పాడి కూలీల జీవితాలతో చెలగాటమాడుతోంది.

అస్తవ్యస్తంగా మారిన పనులు

వేసవికాలం కావడంతో జిల్లాలో వ్యవసాయ పనులు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఉపాధి పథకం అస్తవ్యస్తంగా మారటంతో కూలీలు అష్టకష్టాలు పడుతున్నారు. పనులు చేసిన కూలీలకు కొత్తగా ఈకేవైసీ తప్పనిసరి చేశారు. పనిపూర్తి అయిన అనంతరం పని ప్రదేశంలో కూలీలకు ఐరిస్ తీసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. అప్పుడే కూలీలు పనులకు హాజరైనట్లు పరిగణిస్తారు. ఈ నిబంధన కూలీలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఒకే ప్రాంతంలో వందల మంది కూలీలు పనిచేస్తుంటే సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఐరిస్ నమోదులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పనులు అనుకునంత వేగంగా ముందుకు సాగడం లేదు. పనులు పూర్తి అయిన తర్వాత అప్‌లోడ్ చేయాల్సిన గ్రూప్ ఫొటోల నమోదులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఉపాధి హామీ పథక కూలీలకు పనుల వద్ద మౌలిక వసతులు కల్పించడంతోపాటు ప్రతి వారం వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

మజ్జిగ పంపిణీ చేయాలి

వేసవికాలం ఎండలు మండిపోతున్నాయి. పనుల వద్ద నీడ వసతి లేకపోవడంతో మండుటెండలకు పనులు చేయాలంటే అల్లాడిపోతున్నాం. ఉదయం 9 గంటలకే ఎండలు అధికమవుతుండటంతో ఇబ్బంది పడుతున్నాం. పనుల వద్ద నీడ ఏర్పాటు చేయడంతోపాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి కూలీల ఆరోగ్యాన్ని కాపాడాలి.

– రాములమ్మ, ఉపాధి కూలీ, కోవెలకుంట్ల

వసతులు కల్పించాలి

మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక పేరును ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వీబీజీ రామ్ జీగా మార్చింది. పథకం అమలులో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి కూలీలకు ప్రతి రోజు రూ. 307 సగటు వేతనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. పని ప్రదేశం నీడవసతి, మజ్జిగ, ప్రథమచికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

'బాతు'కు పోరాటం

ఎండలు భగ భగ మండుతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే ప్రజలు బయటకు అడుగు పెట్టేందుకు భయపడుతున్నారు. పశుపక్ష్యాదులకు మండుటెండలోనూ ఆహారాన్వేషణ తప్పదు. తమిళనాడు నుంచి కొందరు బాతుల పెంపకందారులు రుద్రవరానికి చేరుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో ప్రస్తుతం రబీలో సాగు చేసి వరి కోతలు పూర్తయ్యాయి. ఆ పొలాల్లో బాతులను వదలుతున్నారు. అయితే నీటి వసతి అంతంత మాత్రంగా ఉండటంతో ఎండలకు బాతులు అలమటిస్తున్నాయి. ఆర్.కొత్తూరు సమీపంలోని వంకలో అరకొరగా ఉన్న నీటిలో దిగి సేద దీరుతూ ఉపశమనం పొందాయి.

– రుద్రవరం

ఊరు పొమ్మంటుందా?

ఇంటికి నోటీసులు ఇస్తున్న అధికారులు

సున్నిపెంట గ్రామ ముఖద్వారం

- సున్నిపెంట వాసులకు నోటీసులు
- ప్రజల్లో అయోమయ పరిస్థితులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామ ప్రజలు అక్రమంగా నివాసముంటున్నారంటూ రెవెన్యూ అధికారులు ఇస్తున్న నోటీసులతో ప్రజల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. నివశిస్తున్నది జలవనరుల శాఖ భూములు. నోటీసులిస్తున్నది మాత్రం రెవెన్యూ శాఖ అధికారులు. ఇవి ఎలా చెల్లుబాటు అవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి నిమిత్తం వచ్చి 1963 సంవత్సరం నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నారు. సున్నిపెంటనే తమ స్వగ్రామంగా భావిస్తున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు ఇక్కడ లేకపోయినా శ్రీశైలం దేవస్థానంపై ఆధారపడి చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాము నివశిస్తున్న ఇంటికి పట్టాలు ఇచ్చి జీవించే, నివసించే హక్కును ప్రసాదించమని ప్రజలు వేడుకుంటున్నారు.

వరం ఇచ్చిన వైఎస్సార్

ఇక్కడ ఉన్న పరిస్థితులను గమనించి 2008 జనవరి 01న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జీఓ నం02 ఇచ్చి సున్నిపెంటను గ్రామపంచాయతీగా ప్రకటించారు. ప్రభుత్వ గృహాల్లో నివశిస్తున్న అన్నిశాఖల రిటైర్డ్ ఉద్యోగులు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఇళ్లను సొంతానికి ఇవ్వాలని నిర్ణయిస్తూ 2009 ఫిబ్రవరి 05న జీఓ నం21 విడుదల చేశారు. ఆ తర్వాత 2019 అక్టోబర్ 10న గ్రామపంచాయతీగా ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని వసతులు

2023 మేనెల 11న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సున్నిపెంట గ్రామపంచాయతీకి 208.74 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సున్నిపెంటకు నాలుగు సచివాలయాలను తీసుకువచ్చి పరిపాలన ప్రారంభించారు. తాగునీటి సరఫరా కోసం రూ. కోట్లు వెచ్చించి ఆరు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, వీధిలైట్లకు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా నూతన సబ్ స్టేషన్‌ను నిర్మించారు. నాడు–నేడులో భాగంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అభివృద్ధి పనులు చేయించారు.

టీడీపీ పాలనలో..

తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రాగానే 2014 ఆగస్టు 14న జీఓనం 37 తీసుకువచ్చి ఇకపై గ్రామపంచాయితీ చెల్లదని, పరిపాలన జలవనరుల శాఖ వారిదేనని స్పష్టం చేసింది. సున్నిపెంటలో భూమి, గృహాల ఆక్రమణలపై జిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2014 నవంబర్ 26న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలయ్యింది. అధికారుల ఉదాశీనతతో మరికొన్ని ఎకరాల భూమి 12 ఏళ్లలో కబ్జాకు గురయ్యింది. ఇక్కడి ప్రజలకు ఎవరి ఇళ్లు వారికి ఇవ్వాలంటే జీఓ నం21ని అమలు చేయాలి. అలాగే 2025 ల్యాండ్ రెగ్యులరైజేషన్ యాక్ట్ కింద నివాశితులకు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు ఇస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎవరి ఇంటిని వారికి రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియను చేస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు చెబుతున్నారు. లేదంటే ప్రతి కుటుంబానికి 2 బీహెచ్‌కె ఇళ్లు, ఐదు ఎకరాల భూమి, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం, అన్ని వసతులతో కూడిన కాలనీని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మహానంది కిటకిట

భక్తులతో కళకళలాడుతున్న కోనేరు

మహానంది: వేసవి సెలవులు కావడంతో మహానంది క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పరమేశ్వరుడికి ప్రీతికరమైన సోమవారం కావడంతో ఒకే రోజు 30కి పైగా అభిషేకాలు, 40కి పైగా క్షీరాభిషేకాలు జరగగా ఆర్జిత సేవా టిక్కెట్లతో పాటు లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయాలు, వసతి గృహాలు, తదితర విభాగాల ద్వారా ఆలయానికి ఒకే రోజు లక్షల్లో ఆలయం సమకూరింది. మహానంది మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాద విభాగానికి రూ.10,116 విరాళం చెల్లించారు.

ఇద్దరు భక్తులకు గాయాలు

మహానంది: శ్రీమహానందీశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఉదయం ఆళ్లగడ్డకు చెందిన కొందరు భక్తులు మహానందికి రాగా వారిలో ఓ యువకుడు బయట ఉన్న చిన్న కోనేరులో మెట్ల దగ్గర జారిపడటంతో తలకు గాయమైంది. సాయంత్రం మహారాష్ట్రకు చెందిన భక్త బృందంలో హమీన్ ధర్మాన్ ఆరూర్తి కింద పడి తలకు తీవ్ర గాయమైంది. దేవస్థానం అధికారులు స్పందించి కోనేరు మెట్లపై పేరుకుపోయిన పాచిని తొలగించి భక్తుల ప్రాణాలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈతకు వెళ్లి డిగ్రీ విద్యార్థి మృతి

మృతిచెందిన ఉపేంద్ర

ఆలూరు రూరల్: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో ఈ విషాద ఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మనేకుర్తి గ్రామానికి చెందిన శివమ్మ, వీరేష్ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. రెండో కుమారుడు ఉపేంద్ర (18) సోమవారం స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో ఉన్న నీటి కుంటలో ఈతకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో కుంటలో మునిగి మృతిచెందాడు. స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించడంతో నీటి కుంటలో దిగి ఉపేంద్ర మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు ఆలూరు ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం

ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: లాయర్‌ను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జిల్లా జడ్జి లీలా వెంకటశేషాద్రి అన్నారు. సోమవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశమై అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. అలాగే సమస్యలనూ అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి, జూనియర్ సివిల్ జడ్జి దివ్య, సబ్‌జైల్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ప్యానల్ న్యాయవాది వెంకటేశ్వర్లు, వైద్యులు ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అధిక రక్తపోటుతో ముప్పు

కర్నూలు(హాస్పిటల్): అధిక రక్తపోటుకు స్పష్టమైన లక్షణాలు ఉండవని, అది సైలెంట్ కిల్లర్ అని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి మీదుగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండాల క్షీణత వంటి వ్యాధులు వస్తాయని, దీనివల్ల అనారోగ్యం, మరణాలు సంభవిస్తాయన్నారు. సంవత్సరానికి ఒకసారైనా రక్తపోటును పరీక్షించుకోవాలన్నారు. ఆహారంలో ఉప్పు తగ్గించడం, సమతుల ఆహారం, వ్యాయామం, ఒత్తిడిని అదుపులో ఉంచుకోవడం, బీపీ ఉన్నవారు వైద్యులు సూచించిన మందులు వాడటం, మానసిక ప్రశాంతత, స్నేహితులతో సహవాసం వంటి చర్యల ద్వారా రక్తపోటు రాకుండా నివారించవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వరప్రసాద్, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గణాంకాధికారి హేమసుందరం, డెమో ప్రకాష్‌రాజు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

రుద్రవరం: మండలంలోని కోటకొండకు చెందిన సౌభాగ్య (25) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ జయప్ప తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు భర్త పాములేటి తాగుడుకు బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకుండా తిరిగే వాడు. తాగుడు మానుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా భర్త వినక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రసాయన పౌడరును నీటిలో కలుపుకొని తాగి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. ఈమేరకు మృతురాలి తండ్రి చిన్న పీరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె సంతానం.

బొలెరో ఢీకొని ఇద్దరు విద్యార్థులకు గాయాలు

ములకలచెరువు: బొలెరో ఢీకొని ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ములకలచెరువు మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురానికి చెందిన భాను ప్రకాష్(24), నంద్యాలకు చెందిన ఉదయ్ కిరణ్ (24) తిరుపతిలో చదువుకుంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో భానుప్రకాష్ ఇంటికి ఉదయ్ కిరణ్ బైకుపై వెళ్లారు. సోమవారం ఇద్దరు తిరుగు ప్రయాణమై వస్తూ మార్గంమధ్యలోని కదిరిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తిరుపతికి బయలుదేరారు. ములకలచెరువు మండలం వేపూరి కోట వద్దకు రాగానే బొలెరో వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని స్థానికులు 108లో చికిత్స కోసం వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి ప్రథమ చికిత్స అనంతరం భాను ప్రకాష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

పాముకాటుతో బాలుడి మృతి

కోడుమూరు రూరల్: పాముకాటుకు గురై ఓ బాలుడు మృతిచెందాడు. ఈ విషాద సంఘటన మండలంలోని బైనదొడ్డి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన వీరేష్, పద్మావతిలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. తల్లిదండ్రులు ప్రతి రోజులాగే సోమవారం ఉదయం పిల్లలను ఇంటి వద్ద వదిలి ఉపాధి పనులకు వెళ్లారు. పిల్లలు ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో రెండో సంతానమైన కుమారుడు ధర్మ (8)ను పాము కాటువేసింది. విషయాన్ని ఆ బాలుడు చుట్టుపక్కల వాళ్లకు చెప్పడంతో పాటు అప్పుడే పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు చెప్పాడు.వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం పెంచికలపాడు విశ్వభారతి హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కాగా బాలుడు ధర్మ అమ్మమ్మ వాళ్ల ఇల్లు అయిన సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డిలో ఉంటూ అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకునేవాడు. వేసవి సెలవులు రావడంతో తల్లిదండ్రుల వద్దకు రాగా ఈ ఘటన చోటు చేసుకుంది.

ఇండియన్ బ్యాంక్ Indian Bank ALLAHABAD

ఇండియన్ బ్యాంక్

కడప బ్రాంచ్, 20/918, కో-ఆపరేటివ్ కాలనీ, నెహ్రూ పార్క్ దగ్గర, కడప, కడప జిల్లా

స్థిరాస్తులు విక్రయమునకు అమ్మకం ప్రకటన " అపెండిక్స్-IV-A " (నిబంధన 8(6) అంశాలు చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా రుణగ్రహీతలు) మరియు హామీదారులకు తెలియజేయునది ఏమనగా, దిగువ వివరించబడిన స్థిరాస్తులను ఇండియన్ బ్యాంక్, కడప బ్రాంచ్, (సెక్యూర్డ్ క్రెడిటర్)కు తనఖా పెట్టడం జరిగింది. సదరు ఆస్తులను ఇండియన్ బ్యాంక్, కడప బ్రాంచ్ (సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకుకు